శ్మశానంలో పశు వైద్యశాల

ఎక్కడా లేని విధంగా శ్మశాన స్థలంలో పశు వైద్యశాలను నిర్మించారు. గ్రామంలోని నాలుగు సామాజిక వర్గాలకు ఇదే శ్మశానం. వీరికి కర్మక్రతువులు శ్మశానంలోనే నిర్వహించే సాంప్రదాయం ఉండడంతో గ్రామంలో ఎవరైనా మరణిస్తే పశు వైద్యశాల మూతపడి వైద్యసేవలు స్తంభిస్తున్నాయి. మరోపక్క వైద్యశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వానొస్తే భవనంలో తలదాచుకోవడమే కష్టంగా మారింది. వైద్యశాల చుట్టూ చిట్టడవిని తలపించేలా దట్టంగా చెట్లు ఉండడంతో పాములు చొరబడుతూ సిబ్బందిని బెంబేలెత్తిస్తున్నాయి. ఈ దుస్థితి మండల కేంద్రమైన కొడవలూరులో నెలకొంది.


కొడవలూరు పశు వైద్యశాల ముందే ఉన్న సమాధులు

- కర్మక్రతువుల సమయంలో ఆగుతున్న పశు వైద్యసేవలు
- శిథిలావస్థలో వైద్యశాల భవనం
- పాముల భయంతో సిబ్బంది బెంబేలు

కొడవలూరు : కొడవలూరులోని పశు వైద్యశాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అనేక గ్రామాల పాడి రైతులకు ఈ వైద్యశాలే ఆధారం. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ వైద్యశాల అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే వరుసలో ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేశారు. తహసీల్దార్ కార్యాలయానికి పక్కన ప్రభుత్వ స్థలం ఖాళీగా ఉండడంతో గ్రామానికి చెందిన నాలుగు సామాజిక వర్గాల(కుమ్మరి, జంగం, కంశాలి, ఊర ముష్టి)కు గతంలో శ్మశానంగా కేటాయించారు. అప్పట్నుంచీ ఆయా సామాజిక వర్గాల్లో ఎవరు మృతి చెందినా ఇక్కడే ఖననం చేస్తుంటారు. వారి జ్ఞాపకార్థం సమాధులు కూడా నిర్మించుకున్నారు. కొంత కాలం ఇలాగే గడిచాక 1996 ప్రాంతంలో గ్రామానికి పశువైద్యశాల భవనం మంజూరైంది. ఆ భవనాన్ని ప్రభుత్వ కార్యాలయాల వరుసలోనే నిర్మిస్తే సౌకర్యంగా ఉంటుందని భావించి శ్మశానానికి కేటాయించిన స్థలంలోనే ఖాళీగా ఉన్న కొంత స్థలంలో భవనాన్ని నిర్మించారు. అప్పట్నుంచీ ఆ భవనంలోనే పశు వైద్యశాల కొనసాగుతోంది.

ఎవరైనా మరణిస్తే వైద్యశాల మూతే

ఇంతవరకు బాగానే ఉన్నా గ్రామంలో ఎవరైనా మరణిస్తే వైద్యశాల మూతపడే పరిస్థితి నెలకొంది. ఆ నాలుగు సామాజిక వర్గాల్లో ఎవరైనా మృతిచెందితే చిన్న కర్మ, పెద్ద కర్మలు ఇక్కడే చేయడం సాంప్రదాయం. దీంతో ఆ రెండ్రోజులు మృతుని బంధువులు ఒక్కడకు చేరుకుని సాంప్రదాయాలన్నీ నిర్వహిస్తారు. ఆ సమయంలో ఆస్పత్రిని మూసి వేయాల్సి వచ్చి పశు వైద్య సేవలు స్తంభిస్తున్నాయి.

వానొస్తే ఉరుపే

ఆస్పత్రి భవనం పాతికేళ్ల క్రితం నిర్మించినది కావడం, నిర్మాణంలో నాణ్యత లోపించడం కారణాలతో వైద్యశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వానొస్తే భవనంలోని అన్ని గదులు ఉరుస్తున్నాయి. వైద్యశాలలో నిల్వ ఉన్న మందులను కాపాడుకోవడం గగనంగా మారుతోంది.

బెంబేలెత్తిస్తున్న పాములు

వైద్యశాల శ్మశాన ప్రాంతం కావడంతో చుట్టూ దట్టంగా చెట్లు మొలచి చిట్టడవిని తలపిస్తోంది. దీంతో ఈ ప్రాంతం పాములకు ఆవాసంగా మారింది. ప్రమాదకరమైన పాములు పట్టపగలే భవనంలోకి చొరబడుతున్నాయి. దీంతో సిబ్బంది బెంబేలెత్తిపోతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు.


శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాల భవనం

మరోచోట నిర్మించాలి



కొడవలూరులో శ్మశానంగా ఉపయోగిస్తున్న చోటే పశు వైద్యశాలను నిర్మించారు. ఇక్కడి శ్మశానాన్ని మరో చోటకు మార్చాలన్నా పెద్దల జ్ఞాపకార్థం నిర్మించుకున్న సమాధులు ఇక్కడే ఉన్నాయి. ఏడాదికోమారు ఇక్కడ సాంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుంది. పశువైద్య సేవలకు ఇవన్నీ కాస్త ఆటంకంగా ఉంటాయి. పైగా వైద్యశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. భవనాన్ని పునర్ నిర్మించాల్సి ఉంది. ప్రభుత్వ కార్యాలయాల వరుసలోనే ప్రభుత్వ స్థలం ఉన్నందున అక్కడ వైద్యశాల నిర్మిస్తే బాగుంటుంది.

– పి.మురారి, కొడవలూరు

పీహెచ్‌సీ పక్కన ఏర్పాటు చేయాలి



స్థానిక పీహెచ్‌సీ పక్కన ప్రభుత్వ స్థలం ఉంది. ఇక్కడ గతంలో వ్యవసాయశాఖ కార్యాలయ భవనం కొంత నిర్మించి వదిలేశారు. పైగా ఇక్కడి వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరి కూలే స్థితిలో ఉంది. పీహెచ్‌సీ పక్కనున్న స్థలంలో పశు వైద్యశాల భవనం నిర్మిస్తే సౌకర్యంగా ఉంటుంది.

– పి.బాలయ్య, కొడవలూరు

ప్రతి ఏడాది ప్రతిపాదనలు పంపుతున్నాం

వైద్యశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి ఉరుస్తోంది. పైగా పాముల భయం ఎక్కువగా ఉంది. నూతన భవన నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతి ఏడాది ప్రతిపాదనలు పంపుతున్నాం. అయినా మంజూరు కావడం లేదు. శ్మశాన స్థలంలో నిర్మించడం వల్ల విధులకు ఆటంకం కలుగుతోంది. ఈ వరుసలోనే ప్రభుత్వ స్థలాలు ఉన్నందున అక్కడ వైద్యశాల నూతన భవనం నిర్మాణం జరిగితే సౌకర్యంగా ఉంటుంది.

– హర్షారెడ్డి, పశు వైద్యాధికారి, కొడవలూరు

సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని మినగల్లు ఇసుక రీచ్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇసుకను లోడు చేసే విషయంలో లారీలు, ట్రాక్టర్ల యజమానులకు ఆదివారం వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా స్థానిక ట్రాక్టర్ యజమానులు మాట్లాడుతూ స్థానికులైన తమపై వివక్ష చూపుతూ బయట నుంచి వచ్చిన లారీలు, టిప్పర్లకు లోడు చేయడం సమంజసం కాదన్నారు. మొదట స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ విషయమై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ తరలింపు


వెంకన్నపాళెం నుంచి సౌత్‌ఆములూరుకు అనధికారికంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్

తోటపల్లిగూడూరు : మండలంలోని వెంకన్నపాళెం గ్రామంలో టీడీపీ నేతల ఆధ్వర్యంలో మట్టి అక్రమ తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. ఆదివారం సెలవు దినం అయినప్పటికీ జేసీబీలను ఉపయోగించి పలు టిప్పర్ల ద్వారా వెంకన్నపాళెం నుంచి సౌత్‌ఆములూరు గ్రామానికి అనధికారికంగా మట్టి తరలింపు కార్యక్రమాన్ని సాగించారు. వెంకన్నపాళెం నుంచి కొత్తపాళెం, పోట్లపూడి మీదుగా టిప్పర్లతో మట్టి తరలిస్తుండడంతో స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ నేతలు, కార్యకర్తలు మట్టిని తరలిస్తుండడంతో పోలీసులు మిన్నకుండిపోతున్నారు. ఉన్నత స్థాయి అధికారులు జోక్యం చేసుకుని మట్టి మాఫియా ఆగడాలను అరికట్టాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

ఆరోగ్యంపై అవగాహన సదస్సు


మాట్లాడుతున్న శ్రీనివాస్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆరోగ్యంపై అవగాహన సదస్సును ఏసీ సుబ్బారెడ్డి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అంతర్జాతీయ హెపటైటిస్ డేను పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో హెపటైటిస్, లివర్ సంబంధిత అంశాలపై నారాయణ హాస్పిటల్ వైద్యుడు శ్రీనివాస్ అవగాహన కల్పించారు. గౌరవాధ్యక్షుడు కిలారి తిరుపతినాయుడు, అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి అనంతరామారావు, కార్యదర్శి గుర్రం వెంకటసురేంద్రబాబు, మాజీ అధ్యక్షులు బాసం శేషగిరిరావు, గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

ధనలక్ష్మీపురంలో రక్తదాన శిబిరం



నెల్లూరు సిటీ: ధనలక్ష్మీపురంలోని హైస్కూల్లో మెగా రక్తదాన శిబిరాన్ని హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 216 మంది రక్తదానం చేశారు. సొసైటీ వ్యవస్థాపకుడు విజయ్, టీడీపీ నేతలు గిరిధర్‌రెడ్డి, దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌కు ఘన సన్మానం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శతమానం భవతి కార్యక్రమాన్ని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అనంతరం ఈ నెల్లో జన్మించిన 20 మంది వాకర్స్‌తో కేక్‌ను కట్ చేయించి సత్కరించారు. ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ గౌరవ సలహాదారులు నలబోలు బలరామనాయుడు, వినుకొండ వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, మహ్మద్, జయరామ్‌నాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణా వెంకయ్యకు సత్కారం



నెల్లూరు సిటీ: మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన స్వర్ణా వెంకయ్యను వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. నగరపాలక సంస్థ కార్యాలయ సమీపంలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రాజు, అధ్యక్షుడు ఏసునాయుడు, వెంకటరమణ, బల్లి వెంకయ్య, హరి, శ్రీధర్, సురేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి


వస్త్ర సంచుల పంపిణీ

నెల్లూరు సిటీ: కేన్సర్ కారకాల్లో ఒకటైన ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సింహపురి వైద్యశాల అధినేత డాక్టర్ దయాకర్ రావు పేర్కొన్నారు. వేదాయపాళెంలోని చైతన్యపురి పార్కులో కేన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని పార్కు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆధునిక జీవనంలో ఒత్తిడిని జయించే పద్ధతులు.. అహార అలవాట్లలో మార్పులు రావాలని సూచించారు. అనంతరం వస్త్ర సంచులను కార్పొరేటర్ అహల్య పంపిణీ చేశారు. పార్కు అసోసియేషన్ కార్యదర్శి కొండూరు సుబ్బారావు, శ్రీరామ్మూర్తి, మస్తానయ్య, మహేష్‌నాయుడు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పలువురికి కాకాణి పరామర్శ


రాజారాంను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కాకాణి

పొదలకూరు : మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులను ఆదివారం పరామర్శించారు. పట్టణంలోని మొలబంటి రాజారాం అనారోగ్యానికి గురి కాగా ఆయన్ను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని దుగ్గుంటరాజుపాళెం మాజీ సర్పంచ్ ఎం.సుందరామయ్య ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. దీనిపై సమాచారం అందుకున్న కాకాణి గ్రామానికి వెళ్లి పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, పార్టీ నాయకులు మొలబంటి శేఖర్‌బాబు, ఆదూరు వెంకటసుబ్బయ్య, దామిశెట్టి శ్రీనివాసులు, భగవాన్, దుగ్గుంట ఎంపీటీసీ సభ్యుడు కేతు రామిరెడ్డి, మోహన్‌రాజు తదితరులు ఉన్నారు.

అదనపు గదులకు మోక్షం ఎప్పుడో?

- గత ప్రభుత్వంలో శరవేగంగా పనులు
- కొత్త ప్రభుత్వంలో గ్రహణం

ముత్తుకూరు : గత ప్రభుత్వంలో చేపట్టిన భవన నిర్మాణాలు ఎన్నికల తర్వాత ఏర్పడిన కొత్త ప్రభుత్వంలో గ్రహణం పట్టింది. ముఖ్యంగా ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్‌లో గదుల కొరత తీర్చేందుకు గత మార్చిలో నాబార్డు నిధులు రూ.1.92 కోట్లతో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎన్నికల కోడ్ వచ్చే వరకు నిర్మాణం శరవేగంగా జరిగింది. అనంతరం పనులు నిలిచిపోయాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నేటి వరకు పనులు ప్రారంభించలేదు. దీంతో అదనపు గదుల నిర్మాణం పూర్తికాలేదు. మరోవైపు డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నాబార్డు నిధులు రూ.1.43 కోట్లతో సర్వాంగ సుందరంగా అదనపు గదుల నిర్మాణం పూర్తయింది. అయితే ఈ భవనాన్ని ప్రారంభించలేదు. అయితే, పెరిగిన విద్యార్థినుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని ఈ భవనంలో తరగతులు ప్రారంభించారు.


ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్‌లో అసంపూర్తిగా ఉన్న అదనపు గదులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



- చిన్ననాటి స్నేహితుల కోసం విదేశాల నుంచి రాక

కొడవలూరు : ముప్పై ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థులు కలిశారు. అమెరికా, శ్రీలంక వంటి దేశాల్లో స్థిరపడిన వారు సైతం చిన్ననాటి స్నేహితులను కలిసేందుకు వచ్చారు. వారు చదువుకున్న రోజుల్లో చేసిన అల్లరి చేష్టలు, గురువుల బెత్తం దెబ్బలను గుర్తు చేసుకుని ఆనందించారు. ఇందుకు మండలంలోని గండవరం వేదికైంది. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1994–95 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఒక్కటయ్యారు. 30 ఏళ్ల ఏళ్ల తరువాత స్నేహితులు కలవడంతో చిన్ననాటి సంగతులు, ప్రస్తుత విశేషాలను ఒకరికొకరు పంచుకొని ఎంతో ఆనందించారు. అప్పట్లో పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించుకున్నారు. నాటి గురువులను గుర్తు పెట్టుకుని విద్యార్థులు చూపిన మమకారానికి వారు పులకించిపోయారు. కార్యక్రమంలో నాటి గురువులు గున్నయ్య, రమణమూర్తి, చెంచురామయ్య, శాంతికుమార్, రమణయ్య, ప్రస్తుత హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు ఉన్నారు.

ఆటో బోల్తా

- ఇద్దరికి గాయాలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : వేగంగా వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని దామరమడుగు సమీపంలో ముంబై జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం వేగంగా వెళ్తున్న ఆటో ఒక్కసారిగా బోల్తా పడింది. ఆటోలో నలుగురు ప్రయాణికులు ఉండగా, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఆటోను నిలిపి క్షతగాత్రులకు సపర్యలు చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు. ముంబై రోడ్డుపై నిత్యం వాహనాలు అతివేగంగా వెళ్తుండడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డుపై గాయాలతో వృద్ధుడు

- ఆస్పత్రికి తరలించిన కానిస్టేబుల్



నెల్లూరు(క్రైమ్): ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని ఫ్లయ్ ఓవర్ కింద ఓ వృద్ధుడు గాయాలతో రెండు రోజులుగా అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. విషయాన్ని ఆదివారం గమనించిన నార్త్ ట్రాఫిక్ కానిస్టేబుల్ చెన్నయ్య వృద్ధుడ్ని లేపేందుకు విఫలయత్నం చేశారు. నీటితో మొహాన్ని కడిగారు. దుస్తులు మట్టి కొట్టుకొని ఉండటంతో వాటిని శుభ్రం చేశారు. కాలు విరిగి నడవలేని స్థితిలో ఉండటంతో 108 సాయంతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

నేటి నుంచి ఆండాళ్ అమ్మవారికి పూజలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో ఆండాళ్ అమ్మవారి తిరువాడిప్పూర ఉత్సవాలను సోమవారం నుంచి ఆగస్ట్ 8 వరకు నిర్వహించనున్నామని దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుమంజనం, ప్రాకారోత్సవం, ఊంజల్‌సేవను రోజూ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. భక్తులు తరలిరావాలని కోరారు.

అంకమ్మతల్లికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కాకాణి

పొదలకూరు : మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో అంకమ్మతల్లికి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిరదవోలు ఎంపీటీసీ సభ్యుడు రావుల దశరధరామయ్యగౌడ్ ఆధ్వర్యంలో అంకమ్మతల్లి దేవస్థానంలో నిర్వహించిన విశేషపూజలకు కాకాణిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన పూజలు నిర్వహించి పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. కాకాణి వెంట రావుల ఇంద్రసేన్‌గౌడ్, వెన్నపూస దయకార్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, బిరదవోలు పంచాయతీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సామాజిక సేవే లక్ష్యం


పేదలకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

వెంకటాచలం : సామాజిక సేవ చేయడమే లక్ష్యంగా నైనా ఫౌండేషన్ పనిచేస్తున్నట్లు హెబ్రోన్ బిలివర్స్ అసెంబ్లీస్ డైరెక్టర్ బి.డేవిడ్ దయాసాగర్ అన్నారు. వెంకటాచలంలోని చర్చిలో నైనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని పేదలకు తమ వంతు సేవ చేయాలనే ఆలోచనతో గత కొన్నేళ్ల నుంచి నైనా ఫౌండేషన్ పని చేస్తుండడం అభినందనీయమన్నారు. నైనా ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుహాసిని మాట్లాడుతూ కరోనా సమయంలో వెంకటాచలం మండలంతో పాటుగా, ఇతర గ్రామాల్లో ప్రజలకు వంట సరుకులు, దుస్తులు, ఆహార పదార్థాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యుడు కండే వినయ్‌కుమార్, మెడికో సైమన్ సాహిత్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా చాముండేశ్వరీదేవి

- భారీగా దర్శించుకున్న భక్తులు

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నంలో కొలువైన చాముండేశ్వరీదేవి అమ్మవారు ఆదివారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత ఆలయాన్ని యాపిల్, నారింజ, అరటి వంటి పండ్లతో పాటు, వంగ, బెండ, దొండ, క్యాప్సికమ్, ఉల్లిపాయలు, టమోటా తదితర కూరగాయలతో సుందరమనోహరంగా అలంకరించారు. ఉభయకర్తలుగా శ్రీరాజరాజేశ్వరి రైస్ ఇండస్ట్రీస్(నెల్లూరు) అధినేత కొలపర్తి రమేష్, సువర్ణలత, కుమారుడు లిజిత్ కుమార్ వ్యవహరించారు. పండ్లు, కూరగాయల అలంకారణతో విరాజిల్లుతున్న అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ సిబ్బంది భక్తుల కోసం ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకులు అనిల్‌స్వామి, రామకృష్ణస్వామి, కిశోర్‌స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తుల రాకతో ఆలయం కోలాహలంగా మారింది.


శాకంబరి అలంకరణలో అమ్మవారు



పండ్లు, కూరగాయలతో అలంకరించిన ఆలయం

సత్తాచాటిన గండవరం యోగా మాస్టర్

కొడవలూరు : సౌతిండియా యోగా చాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని గండవరం ఆయుష్ యోగా మాస్టర్ జ్యోతి రాజేంద్రకుమార్ ప్రథమ స్థానం దక్కించుకున్నారు. ఇండియన్ యోగా అసోసియేషన్, తమిళనాడు స్పోర్ట్స్ యోగాసన అసోసియేషన్ సంయుక్తంగా చెన్నై టీనగర్‌లో 12వ సౌతిండియా యోగా చాంపియన్ షిప్–24 పోటీలను ఆదివారం నిర్వహించారు. ఇందులో రాజేంద్రకుమార్ పాల్గొని మొదటి బహుమతి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు నిర్వాహకులు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందజేశారు. గండవరం ఆయుర్వేద వైద్యాధికారి ఎస్.గీత, హైస్కూల్ హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు ఆయనకు అభినందనలు తెలిపారు.


మొదటి బహుమతిని అందుకుంటున్న రాజేంద్రకుమార్